ఎములాడ రోడ్లకు మోక్షమెప్పుడో?

- మార్కింగ్ చేసి, వదిలేశారు..
- ప్రారంభం కాని విస్తరణ పనులు
- ఇరుకు రోడ్లతో తరచూ ట్రాఫిక్‌జాం
- ఇబ్బంది పడుతున్న రాజన్న భక్తులు



వేములవాడ ఆలయం ఎదుట ట్రాఫిక్‌జాంతో భక్తుల ఇబ్బందులు

వేములవాడ: దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడలో రోడ్ల విస్తరణకు మోక్షం లభించడం లేదు. మాజీ సీఎం కేసీఆర్ మూడు పర్యాయాలు పట్టణంలో పర్యటించి, పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ, ఏళ్లు గడిచినా.. రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వమే కొనసాగినా ఫలితం లేకపోయింది. పాలకుల ఆదేశాలతో అప్పటికప్పుడు కొలతలు వేయడం, ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని ప్రకటించడం పరిపాటిగా మారింది. రోడ్లు ఇరుకుగా మారి, ఇబ్బందులు పడుతున్నామని భక్తులు అంటున్నారు. తరచూ ట్రాఫిక్‌జాం అవుతుండటంతో రాజరాజేశ్వర స్వామి సన్నిధికి చేరేందుకు నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు శ్రమిస్తున్నా గంటలకొద్దీ వేచిచూడాల్సి వస్తోంది. కోట్లాది రూపాయల ఆదాయం ఉన్న ఎములాడ రాజన్న గుడి వద్ద రోడ్ల దుస్థితి చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. మెయిన్ రోడ్డు గుండా వెళ్లాలంటే జనం భయపడుతున్నారు. అధికారులు ఓసారి 70 ఫీట్లు, మరోసారి 80 ఫీట్లు, ఇంకోసారి 100 ఫీట్ల వరకు రోడ్ల విస్తరణ అంటూ ప్రకటించారు. చివరకు 80 ఫీట్ల వరకు చేపడుతున్నామని, ఇందుకు వీటీడీఏ నుంచి రూ.17 కోట్లు కేటాయించినట్లు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పత్రికా ముఖంగా ప్రకటించారు. అయినప్పటికీ పనులకు మోక్షం కలగలేదు.

వ్యాపారుల్లో ఆందోళన..

వేములవాడ ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడు రోడ్ల విస్తరణ ప్రారంభిస్తుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. దుకాణాలను చక్కదిద్దుకోవాలా? కిరాయిల అంశం యజమానులతో మాట్లాడుకోవాలా? తెలియక తల పట్టుకుంటున్నారు. ఎవరిని పలకరించినా రోడ్ల విస్తరణ అనివార్యమే.. కానీ, ఎప్పుడు చేస్తారన్నదే ప్రశ్న అంటున్నారు. సమ్మక్క జాతర సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తులు ఇరుకు రోడ్లతో నానాతంటాలు పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం మారడంతో ఎలాంటి నిర్ణయం ఉంటుందోనని సర్వత్రా చర్చ జరుగుతోంది.

ట్రాఫిక్ సమస్య తీరడం లేదు



వేములవాడ పట్టణంలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం. బారికేడ్లు ఏర్పాటు చేశాం. అదనంగా పోలీసు సిబ్బందిని రప్పిస్తున్నాం. రోడ్ల విస్తరణే సమస్యకు పరిష్కారం. అప్పుడే భక్తులు, స్థానికుల ఇబ్బందులు తీరుతాయి.

– కరుణాకర్, వేములవాడ టౌన్ సీఐ

చేరుకోవడం కష్టమవుతోంది



ఎములవాడ రాజన్న మా ఇలవేల్పు. ఏటా తప్పకుండా రెండు లేదా మూడు సార్లు వచ్చి, దర్శించుకుంటాం. కానీ, ఇక్కడి రోడ్ల పరిస్థితి బాగాలేదు. ఆలయం వద్దకు చేరుకోవడం కష్టమవుతోంది. తెలంగాణ వచ్చినా సౌకర్యాలు మెరుగుపడలేదు.

– తిరుపతిరెడ్డి–సరిత దంపతులు, హైదరాబాద్

అభివృద్ధి పనులు చేపట్టలేదు



వేములవాడ పట్టణంలో గుడి ముందుకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లను బాగు చేయాలన్న సోయి గత పాలకులు లేదు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. రోడ్ల విస్తరణపై చర్చకు రావాలి.

– నందిపేట సుదర్శన్‌యాదవ్, మాజీ ధర్మకర్త

ప్రభుత్వానికి నివేదించాం



వేములవాడ మెయిన్ రోడ్డు విస్తరణకు గతంలోనే కొలతలు తీశాం. స్పెషల్ ఆఫీసర్ సమక్షంలో ఈ పని చేశాం. బ్రిడ్జి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 80 ఫీట్ల వెడల్పుతో పనులు చేపట్టాలని, ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి రాగానే చేయిస్తాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



రుద్రంగిలో టపాసులు పేల్చుతున్న నాయకులు



తిప్పాపూర్‌లో..

రుద్రంగి: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడం పట్ల రుద్రంగి మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్, అంబేడ్కర్, హనుమాన్ చౌరస్తాల వద్ద టపాసులు పేల్చి, సంబరాలు జరిపారు. ఎల్లవేళలా ప్రజల కోసం పాటుపడే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ ఇవ్వడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, శ్రీనివాస్, గంగాధర్, మల్లేశం, నారాయణ, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ వచ్చిన సందర్భంగా శుక్రవారం తిప్పాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘రానున్న కాలం బీజేపీదే.. అధైర్యపడొద్దు’



మాట్లాడుతున్న వికాస్‌రావు

చందుర్తి: ఎన్నికల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి, ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలని బీజేపీ వేములవాడ నియోజకవర్గ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు కోరారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న కాలం బీజేపీదేనని, అధైర్యపడకుండా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడి రమేశ్, మార్త సత్తయ్య, సిరికొండ శ్రీనివాస్, పోంచెట్టి రాకేశ్, చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్: జిల్లా యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయసు గల యువతీయువకులు ఈనెల 19న సిరిసిల్ల మినీస్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఫోక్ డ్యాన్స్, ఫోక్‌సాంగ్స్, కథలు రాయడం, పోస్టర్ మేకింగ్, ఉపన్యాసం, ఫొటోగ్రఫీ అంశాలలో ప్రతిభ చాటాలన్నారు. ప్రగతి శీల భారత్ స్పోర్ట్స్, ఆత్మ నిర్భర భారత్, యోగా, ప్రకృతి, ఫిట్‌నెస్ అంశాలపై తమ ప్రతిభను చాటాలన్నారు. సిరిసిల్ల మినీస్టేడియంలో ఈనెల 21 పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు జనవరి మొదటి వారంలో జరిగే రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొంటారన్నారు. జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నిర్ణీత సమయంలో గ్యారంటీల అమలు

- బీఆర్ఎస్ నేతలకు ఉలుకెందుకు?
- ఆటోవాలాలు ఆందోళన చెందొద్దు
- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నిర్ణీత సమయంలో అమలు చేస్తుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలకు ఉలుకెందుకన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలయ్యాయని, మిగతావి మూడు నెలల్లో చేసి తీరుతామని పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం ఆటోవాలాలకు సమస్యగా ఉంటే ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, ఆందోళన చెందొద్దని సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

సిరిసిల్ల పట్టణంలోని 38వ వార్డుకు చెందిన పిట్టల శ్రీకాంత్, 50 మంది యువకులు మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు మండలం సత్యం, కౌన్సిలర్ వెల్దండి దేవదాసు, బూట్ల నవీన్ తదితరులు ఆయనను కలిశారు. వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు ఎల్లె లక్ష్మీనారాయణ, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్, సామల దేవదాసు తదితరులున్నారు.

వస్త్ర కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు అమలు కాలేదని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వర్కర్ టు ఓనర్ పథకం అమలు చేయాలని, బతుకమ్మ చీరల సబ్సిడీ, యారన్ పెండింగ్ డబ్బులు ఇప్పించాలని కోరారు. నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజులతో కలిసి మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

జీవనభృతి ఇవ్వాలని ఆటోడ్రైవర్ల ఆందోళన



చందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఉపాధి దెబ్బతిందని, తమకు రూ.15 వేల జీవనభృతి ఇవ్వాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చందుర్తి బస్టాండ్ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఆటో యూనియన్ వేములవాడ డివిజన్ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, చందుర్తి మండల అధ్యక్షుడు బత్తుల కమలాకర్‌ల ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ర్యాలీగా వెళ్లి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఆటో యూనియన్ సభ్యులు తిప్పని ప్రభాకర్, పోతురాజు శ్రీనివాస్, పాటి జ్యోతి, బత్తుల జ్యోతి, భూమయ్య, చింతం పోంశెట్టి, బంటు మోసు, ఎండీ.బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు జిల్లాల ఫొటోగ్రాఫర్ల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

ముస్తాబాద్: ఫొటోగ్రాఫర్లు ఇకముందు షెడ్యూల్ ప్రకారమే పని చేయాలని తీర్మానించారు. ముస్తాబాద్‌లోని ఓ గార్డెన్స్‌లో రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల ఫొటోగ్రాఫర్ల సమావేశం శుక్రవారం జరిగింది. నిద్ర లేకుండా పని చేయడంతో ఫొటో, వీడియోగ్రాఫర్లు అనారోగ్యానికి గురై, చనిపోతున్నారని అన్నారు. నిద్ర లేకుండా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పని చేస్తామని తెలిపారు. రాత్రి 12 దాటిన తర్వాత ప్రోగ్రాం నడిస్తే అదనపు ఫీజు తీసుకుంటామన్నారు. ఆయా జిల్లాలు, మండలాల బాధ్యులు పల్లె వెంకటి, కాసోడి రమేశ్, శ్రీకాంత్, శంకర్, ప్రశాంత్, అంజి, చందు, బాలెల్లం తదితరులున్నారు.

కూలీలకు ‘ఉపాధి’ పనులు కల్పించాలి

- అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్
- బోయినపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: ఉపాధిహామీ పనుల్లో కూలీల భాగస్వామ్యం పెంచాలని అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్ ఆదేశించారు. మండల పరిషత్‌లో శుక్రవారం ఈజీఎస్ పనులపై మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. 2021, నవంబర్ 1 నుంచి 2023, మార్చి 31 వరకు బోయినపల్లి మండలంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. మండలంలో రూ.4.81 కోట్ల అంచనాలతో 385 పనులు చేపట్టినట్లు ఈజీఎస్ ఏపీవో సబిత తెలిపారు. ఇందులో రూ.3.78 కోట్లు లేబర్ కాంపోనెంట్, రూ.1.03 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద వినియోగించినట్లు తెలిపారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ రామారావు, అంబుడ్స్‌మెన్ రాకేశ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో వనం సబిత, స్టేట్ రిసోర్స్ పర్సన్ మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

జరిమానా.. రికవరీ

సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు జరిమానా వేయడంతోపాటు రికవరీకి ఆదేశించారు. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలతో రూ.29,243 రికవరీకి ఆదేశించగా, మరో రూ.13 వేలు జరిమానా విధించారు.

ముగిసిన వరి ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణం, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. వానాకాలం సీజన్‌లో వేములవాడ అర్బన్‌లో 5,500 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పట్టణంతోపాటు వేములవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్‌లో 3,274 మంది రైతుల వద్ద నుంచి 1,55,505 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని 370 మంది రైతుల వద్ద నుంచి 16,631 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. రుద్రవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని 95 మంది రైతుల వద్ద నుంచి 5,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- రెండు రోజుల అనుమతితో వారమంతా దందా
- చోద్యం చూస్తున్న అధికారులు
- రుద్రంగి మండలంలో పరిస్థితి



ఉదయం 7 గంటలకే ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

రుద్రంగి: మండలంలో అనుమతుల పేరిట ఇసుక అక్రమ రావాణా జోరుగా సాగుతోంది. తెల్లవారకముందు మొదలైతే.. రాత్రి వరకూ ఇసుక దందా నడుస్తోంది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఇసుక దందా సాగించేవారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మూడు గంటలే అనుమతి..

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక ట్రాక్టర్‌కు రెండు ట్రిప్పుల ఇసుక రవాణాకు మాత్రమే అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి. అది కూడా వారానికి రెండు రోజులు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే. కానీ, మండలస్థాయి అధికారులు, ఇసుక వ్యాపారులు కుమ్మక్కై వారమంతా ఉదయం, పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. దీనిపై తహసీల్దార్ శ్రీలతను వివరణ కోరగా.. ఒక ట్రాక్టర్ రెండు కంటే ఎక్కువ ట్రిప్పుల ఇసుక తరలించినా, మధ్యాహ్నం 2 గంటల కంటే ముందు గానీ, సాయంత్రం 5 గంటల తర్వాత గానీ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉచిత ప్రయాణానికి తప్పని నిరీక్షణ



ముస్తాబాద్ బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న మహిళలు

ముస్తాబాద్: ఆర్టీసీ ఉచిత ప్రయాణం మహిళలను బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించేలా చేస్తోంది. ముస్తాబాద్ కొత్త బస్టాండ్‌లో మహిళలు శుక్రవారం సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట వైపు వెళ్లే బస్సుల కోసం చాలాసేపు వేచి ఉన్నారు. ఉచిత ప్రయాణం కావడంతో ఆలస్యమైనా సరే.. బస్సులు వచ్చాకే ఎక్కారు. పలు రూట్లలో నడిచే ఆటోలు ఖాళీగా కనిపించాయి. అయితే, బస్సుల సంఖ్య పెంచాలని మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మహేందర్‌రెడ్డితో ఎంపీటీసీ సభ్యుడు రాము

తంగళ్లపల్లి: మండలంలోని చిన్న లింగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు బైరినేని రాము బీఆర్ఎస్ పార్టీని వీడి, శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆయనకు కండువా కప్పి, ఆహ్వానించారు.

వైద్యం కోసం రూ.20 వేల ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునే స్థోమత లేదు. విషయం తెలుసుకున్న కేరళ మోడల్ స్కూల్ యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది శుక్రవారం అతనికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణకుమార్, బిన్సీ, బాలకృష్ణ, నరేశ్ రెడ్డి, బిజూ, ఘనీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుద్రంగి కేజీబీవీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీలత

రుద్రంగి: మండల కేంద్రంలోని కేజీబీవీని తహసీల్దార్ శ్రీలత శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో చలి తీవ్రత అధికంగా ఉండనుందని, విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, కేజీబీవీ ఎస్‌వో వనిత తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మందికి జైలు

వేములవాడ: పట్టణ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మందిని శుక్రవారం వేములవాడ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. వీరిలో 8 మందికి జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, మిగతావారికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి, వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

మూఢనమ్మకాలను వీడాలి

బోయినపల్లి: ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు చెన్నమాధవుని రామరాజు అన్నారు. శుక్రవారం రాత్రి బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి బ్రహ్మంగారి ఆలయం ఎదుట రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు నిమ్మకాయలు, కుంకుమ, పసుపు పెట్టడం కలకలం సృష్టించింది. విషయం తెలుసుకున్న రామరాజు అక్కడికి వెళ్లి, నిమ్మకాయలను తీసి, నోటితో రెండుముక్కలు చేసి, రసం పీల్చి పడేశారు. ప్రజలు ఇలాంటి వాటికి భయపడవద్దని చెప్పేందుకే ఇలా చేశానని తెలిపారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

సిరిసిల్లటౌన్: యాక్సిస్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 68 మంది విద్యార్థులు హాజరవగా బిజినెస్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. ఎంపికైనవారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్లు వేణు, కిరణ్, డ్రైవ్ హెచ్‌ఆర్‌లు సంతోష్‌కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో అవస్థలు



లారీ వెనకాల లేస్తున్న దుమ్ము

వీర్నపల్లి: మండల కేంద్రంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా లేస్తున్న దుమ్ముతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఊరు చివర ఉన్న ఫారెస్ట్ గెస్ట్ హౌస్ వరకు ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తోంది. గుంతల కారణంగా వాహనాలు తరచూ చెడిపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో లారీలు వెళ్తున్నాయని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని, బయటకు రావాలంటే భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించాలని, రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

వరల్డ్ కప్‌లో రాణించాలి

తంగళ్లపల్లి: ముస్తాబాద్ మండలంలోని పోతుగల్‌కు చెందిన ఎరవెల్లి అవినాశ్‌రావు అండర్–19 క్రికెట్ వరల్డ్ కప్ జట్టులో స్థానం సంపాదించడంపై క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్మాని రామలింగా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వరల్డ్ కప్‌లో రాణించాలని, భారత జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

మా‘నీటి’లో సూర్యాస్తమయం



బోయినపల్లి: మిడ్‌మానేరు ప్రాజెక్టు డౌన్ స్ట్రీమ్‌లో మల్లాపూర్ మానేరు వాగు అందాలు శుక్రవారం సాయంత్రం కనువిందు చేశాయి. పాయలుగా పారుతున్న నీటిలో అస్తమిస్తున్న సూర్యుని ప్రతిబింబం చూపరులను ఆకట్టుకుంది.

జాతీయ అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్‌కుమార్, పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్‌లు గత ఆదివారం విజయవాడలో జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు పయ్యావుల రామచంద్రం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు వివిధ రంగాల్లో చేసిన సామాజిక సేవలను గుర్తించి, జాతీయస్థాయికి ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, మేగి నర్సయ్య, నంది కిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట: మండల ఆర్యవైశ్య సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆవిష్కరించారు. సంఘం మండలాధ్యక్షుడు గుండా చిన్నమల్లేశం, ప్రధాన కార్యదర్శి బచ్చు అశోక్, కోశాధికారి బొమ్మకంటి రాజేశం, కార్యవర్గ సభ్యులు బొమ్మకంటి రాజయ్య, తోట వేణుగోపాల్, నగుబోతు రమేశ్, గంప అంజయ్య, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.